సాక్షి
పల్నాడు
బుధవారం । 23 । జూలై । 2025



ఆలయానికి విరాళం


నాదెండ్ల: సాతులూరులోని గ్రామ దేవతల ఆలయ భోజనశాల నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన పారిశ్రామికవేత్త కేవీ రెడ్డి రూ.51,116 విరాళంగా అందించారు.



కార్తికేయుని సన్నిధిలో ..

మోపిదేవి: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని విజిలెన్స్ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ ఎల్.వి.రమణమూర్తి దంపతులు మంగళవారం దర్శించుకున్నారు.

శాకంబరిదేవిగా సీతాలాంబతల్లి



నాదెండ్ల: సాతులూరులోని బండారువల్లి వారిపాలెంలో కొలువై ఉన్న సీతాలాంబతల్లిని ఆషాఢమాసం సందర్భంగా మంగళవారం శాకంబరిదేవిగా అలంకరించారు.

న్యూస్‌రీల్

నిండుకుండలా విప్పర్ల చెక్‌డ్యాం



విప్పర్ల(క్రోసూరు): వర్షాలు కురుస్తుండటంతో మండలంలోని విప్పర్ల చెక్ డ్యాంకు భారీగా నీరు చేరింది. చెక్‌డ్యాం నిండుకుండలా తొణికిసలాడుతుంది. వేసవి కాలంలో పంట పొలాలకు నీరు పెట్టుకునేందుకు ఉపయోగపడే విధంగా 15 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన చెక్ డ్యాంలో ఇప్పటికీ కొద్ది మేర నీరు నిలువ ఉంటుంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెక్ డ్యాం నిండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు

జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో జాయింట్ కలెక్టర్

నరసరావుపేట: జిల్లాలోని ఇసుక రీచ్‌ల్లో 2021–2024 కాలానికి అక్రమ తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే అధికారులను ఆదేశించారు. శాటిలైట్ ఛాయా చిత్రాల ఆధారంగా 126హెక్టార్లలో ఇసుక అక్రమ తవ్వకాల విషయంలో సంబంధిత సంస్థలను బాధ్యులుగా నిర్ధారించాలన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. మాచర్ల నియోజకవర్గంలో నూతన ఇసుక స్టాక్ పాయింట్‌ను వారం రోజుల్లోగా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో అక్టోబరు 15 వరకు ఇసుక తవ్వకాలపై నిషేధం ఉంటుందని, అప్పటివరకు తవ్వకాలను నిరోధించేందుకు జిల్లా, మండలస్థాయి టాస్క్‌ఫోర్సులు పని చేస్తాయన్నారు. అదనపు ఎస్పీ జేవీ సంతోష్, జిల్లా మైన్స్ జియాలజీ అధికారి నాగిని, ఆర్డీవోలు రమణాకాంతరెడ్డి, మురళీకృష్ణ, భూగర్భ జలశాఖ ఏడీ రామబాలాజీరెడ్డి, పిడుగురాళ్ల ఎంపీడీఓ రాంబాబు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన వీఆర్వో సస్పెన్షన్

బెల్లంకొండ: వివాహితపై లైంగిక వేధింపులకు పాల్పడిన నాగిరెడ్డిపాలెం వీఆర్వో డి.వెంకయ్యను సస్పెండ్ చేస్తూ పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రేషన్ కార్డులో పిల్లల పేర్లు మార్పు కోసం దరఖాస్తు చేసుకున్న వివాహితపై లైంగిక వేధింపులకు పాల్పడడంతో, సదరు మహిళ వీఆర్వో వేధింపులను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో వీఆర్వోను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు స్థానిక తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌కు ఉత్తర్వులు పంపించారు.

సమ్మె విరమించిన మున్సిపల్ కార్మికులు

నరసరావుపేట: తమ డిమాండ్ల సాధన కోసం ఇంజనీరింగ్ కార్మికులు గత పది రోజుల నుంచి చేస్తున్న సమ్మెను మంగళవారం నుంచి తాత్కాలికంగా విరమించారు. ఈ మేరకు సీఐటీయు నాయకులు షేక్ శిలార్, చిన్న అల్లాబక్షు, కార్మికులు మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావును కలిసి తెలియచేశారు. షేక్ శిలార్ మాట్లాడుతూ కార్మికుల జీతాలను ప్రభుత్వం పాక్షికంగా పెంచుతూ తీసుకున్న నిర్ణయంతో తాము సమ్మెను తాత్కాలికంగా విరమించామన్నారు.

568.30 అడుగులకు సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 568.30 అడుగులకు చేరింది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

తమ్ముళ్ల పేకాట జోరు

కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని ప్రాంతాల్లో వెలసిన జూద కేంద్రాలు

- తెలుగుతమ్ముళ్ల ఆధ్వర్యంలో బరుల నిర్వహణ
- ఆదాయ మార్గంగా పేకాట శిబిరాలు నిర్వహించాలని అనుచరులకు ప్రజాప్రతినిధుల సూచన
- మాచర్ల, చిలకలూరిపేట, వినుకొండ, గురజాలలో పెద్దఎత్తున నిర్వహణ
- జిల్లా కేంద్రం నరసరావుపేటలో హోటళ్లు, అపార్టుమెంట్లలో పేకాట
- ప్రతి రోజూ రూ.కోట్లలో చేతులు మారుతున్న వైనం
- రోడ్డున పడుతున్న కుటుంబాలు
- చూసీచూడనట్టు వదిలేస్తున్న పోలీసు యంత్రాంగం



శావల్యాపురం మండలం కారుమంచి గ్రామ శివారులోని సపోటా తోటలో పేకాటరాయుళ్లను పట్టుకున్న శావల్యాపురం ఎస్ఐ ఎల్ లోకేశ్వరరావు (ఫైల్)

సాక్షి, నరసరావుపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పల్నాడు జిల్లాలో తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తల ఆధ్వర్యంలో జోరుగా పేకాట శిబిరాలు నడుస్తున్నాయి. ఎన్నడూలేని విధంగా పేకాట మూడు జోకర్లు... ఆరు షోలుగా వర్ధిల్లుతోంది. డైమండ్ రాణి, ఇస్పేట్ ఆసు అంటూ రేయింబవళ్లు పేక ముక్కల సందట్లో జిల్లా వ్యాప్తంగా రూ.కోట్లు చేతులు మారుతున్నాయి. అధికార పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న జూదశిబిరాలు కావడంతో సమాచారం ఉన్నా పోలీసులు ఆ వైపు తొంగిచూడటం లేదు. ముఖ్యంగా నరసరావుపేట, మాచర్ల, చిలకలూరిపేట, దాచేపల్లి, గురజాల, వినుకొండ పట్టణాల పరిధిలో పేకాట జోరుగా కొనసాగుతోంది. ఇతర రాష్ట్రం, జిల్లాల నుంచి పేకాటరాయుళ్లు భారీగా తరలివస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి జూదం పడగవిప్పింది. ఫలితంగా అనేక కుటుంబాలు రోడ్డునపడ్డాయి. అయినప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

జోరుగా పేకాట శిబిరాలు

జూదగాళ్లు పల్నాడు, ప్రకాశం జిల్లా సరిహద్దు ప్రాంతాలలో జోరుగా పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారు. వినుకొండ నియోజకవర్గ పరిధిలోని మారుమూల ప్రాంతాల్లో నిత్యం పేకాట జరుగుతుండగా, వీటికి పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాలపాటు ఇతర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున కార్లలో వచ్చి పేకాటలో పాల్గొంటున్నారు. మాచర్ల నియోజకవర్గంలో పేకాట జోరుగా సాగుతోంది. వెల్దుర్తి, కారంపూడి, దుర్గి, సాగర్ పోలీసుస్టేషన్లతోపాటు ఏకంగా మాచర్ల పట్టణంలో ప్రత్యేకంగా గదులు తీసుకొని పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారు. అచ్చంపేట, బెల్లంకొండ ప్రాంతాలలో కృష్ణానది పరివాహక ప్రాంతాలలో అయితే అడ్డూ అదుపులేకుండా సాగుతోంది. చిలకలూరిపేటలో ప్రజాప్రతినిధి అండదండలతో పట్టణ నడిబొడ్డులో ఏకంగా పేకాట క్లబ్ నిర్వహిస్తున్నారు. దీంతోపాటుగా యడ్లపాడు, బోయపాలెం, సాతులూరు, కోమటినేనివారిపాలెం, కావూరు గ్రామాలలో ద్వితీయ శ్రేణి నాయకులు జూద శిబిరాలను ఏర్పాటు చేశారు. రాజుపాలెం, పాకాలపాడు గ్రామాలలో పేకాట రాయుళ్ల కదిలికలు ఉంటున్నాయి. పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాలలో పేకాట విచ్చలవిడిగా సాగుతోంది. ఒక రోజు గురజాలలో పేకాట నిర్వహిస్తే మరో రోజు దాచేపల్లి మండల పరిధిలో మకాం మారుస్తున్నారు. ఉదయం 6 గంటలకు జూదగాళ్లకు ఆ రోజు పేకాట నిర్వహించే ప్రాంతాలను తెలియజేస్తున్నారు. దీంతో ఖరీదైన కార్లలో అక్కడ వాలిపోతున్నారు. ప్రజాప్రతినిధి ఆదేశాలు, నిర్వాహకులు ఇస్తున్న ముడుపులతో పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని బహిరంగంగా చర్చించుకుంటున్నారు.



అమరావతిలోని ఓ లాడ్జిలో పేకాట రాయుళ్లను పట్టుకున్న సీఐ వై అచ్చయ్య (ఫైల్)

అనుచరులకు ఆదాయ మార్గంగా

టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు పేకాటను ఆదాయ మార్గంగా ఎంచుకున్నారు. ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధుల మద్దతుతో యథేచ్ఛగా జూదశిబిరాలు నిర్వహిస్తున్నారు. పేకాటలో పాల్గొనే వారి నుంచి ఒక్కో షోకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నట్టు సమాచారం. ఒకరోజు శిబిరం నిర్వహిస్తే నిర్వాహకులకు రూ.లక్ష వరకు ఆదాయం వస్తున్నట్టు తెలుస్తోంది. దీంట్లో ప్రజాప్రతినిధికి కొంత, పోలీసులకు మరికొంత ముట్టజెబుతున్నామంటూ నిర్వాహకులు బహిరంగంగానే చెబుతున్నారు. అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడకపోవడం వారి ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. దిద్దుబాటు చర్యలలో భాగంగా ఇటీవల జిల్లాలో అక్కడక్కడా పేకాట శిబిరాలపై దాడులు చేసి పేకాటపై ఉక్కుపాదం మోపుతున్నట్టు ప్రచారం చేసుకుంటున్నారు. స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు పేకాట శిబిరాలపై పూర్తి అవగాహన ఉన్నా అలసత్వం వహిస్తున్నారన్న వాదనలు ఉన్నాయి. నెలవారీ మామూళ్లకు అలవాటు పడి పేకాట శిబిరాలకు సహకరిస్తున్నట్టు ఆరోపణలు లేకపోలేదు. ఏదీ ఏమైనప్పటికీ జూదానికి అలవాటుపడ్డ వారి కుటుంబాలు ఇప్పటికే అప్పుల ఊబిలో కూరుకుపోయి రోడ్డుపడ్డాయి. మరికొంతమంది బలవన్మరణాలకు పాల్పడే పరిస్థితులు దాపురించాయి.



కారంపూడి మండలం చింతపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వారిని తమ సిబ్బందితో కలసి పట్టుకున్న ఎస్ఐ ఎం వాసు (ఫైల్)

ఎస్పీ కార్యాలయానికి కూత వేటు దూరంలోనే...

పేకాట శిబిరాలు గతంలో చెట్లు, గుట్టల కింద గుట్టుగా జరిగేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లాడ్జిలు, ప్రత్యేకంగా అద్దెకు తీసుకున్న ఇళ్లలో జూదం నిర్వహిస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా నరసరావుపేటలో పేకాట సంస్కృతిని తీసుకువచ్చారు. విచ్చలవిడిగా జూద శిబిరాలను ఏర్పాటుచేసి అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు. బరంపేట, అల్లూరివారిపాలెం, ములకలూరు, ఎల్బీ నగర్, యలమంద తదితర ప్రాంతాలతో కలిపి ఒక నరసరావుపేట నియోజకవర్గ పరిధిలోనే పదికి పైగా పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇవన్నీ ఎస్పీ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉండటం గమనార్హం. కొన్ని హోటళ్లలో నిర్వాహకులు గదులు తీసుకొని పేకాట టేబుళ్ల ఏర్పాటు చేయడంతోపాటు అవసరమైన ఆహారం, మందు సరఫరా చేస్తున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ వ్యవహారం నడుస్తోంది. జిల్లాలోని పేకాటరాయుళ్లకు నరసరావుపేట నిర్వాహకులు ఫోన్లు చేసి ఆహ్వానం పలుకుతున్నారు.

విషాదం నింపిన వివాదం

- గొల్లుమన్న కారుమంచి గ్రామం
- గ్రామానికి చేరిన మృతదేహాలు

శావల్యాపురం: మానవ సంబంధాలు, రక్త సంబంధాలు రోజురోజుకు దిగజారిపోతున్నాయనటానికి కారుమంచి ఘటన ఉదాహరణ. వివరాలు ఇలా ఉన్నాయి.. అన్నదమ్ముల మధ్య చెలరేగిన వివాదం ఒకే కుటుంబంలో తీరని విషాదాన్ని మిగిల్చింది. సోమవారం సాయంత్రం శావల్యాపురం మండలం కనమర్లపూడి గ్రామం వద్ద జాతీయ రహదారి మార్గంపై జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృత్యువాత పడిన సంఘటన విషాదాన్ని నింపింది.

గొడవకు దారి తీసిన పరిస్థితులు...

కారుమంచి గ్రామానికి చెందిన బత్తుల శ్రీనివాసరావు, బత్తుల వెంకటరావు అన్నదమ్ములు. వీరి మధ్య కొన్నేళ్లుగా స్థల వివాదం ఉంది. ఈ క్రమంలో పెద్దల సమక్షంలో రాజీ జరిగినా ఫలించలేదు. సోమవారం అన్నదమ్ముల కుటుంబ సభ్యుల మధ్య జరిగిన వివాదం కాస్త ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో బత్తుల శ్రీనివాసరావుకు గాయమైంది. ఈ విషయమై శావల్యాపురం పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశారు. పోలీసుల సూచన మేరకు చికిత్స కోసం ఆటోలో వినుకొండకు బయలుదేరారు. మార్గంమధ్యలో మినీ వాహనం మృత్యువు రూపంలో కబళించింది. ప్రమాదంలో బత్తుల బ్రహ్మయ్య, బత్తుల నాగమూర్తమ్మ, బత్తుల అంజమ్మ, బత్తుల ముత్యాలమ్మలు మృతి చెందారు. బత్తుల యశోదకుమారి రెండు కాళ్లు విరగగా గుంటూరులోని ప్రైవేట్ వైద్యశాలలో మృత్యువుతో పోరాడుతుంది.

ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి

బత్తుల శ్రీనివాసరావు తల్లి ముత్యాలమ్మ, భార్య నాగమూర్తమ్మ మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. అంతేగాక ఆయన కుమార్తె యశోదకుమారి తీవ్ర గాయాలై మృత్యువుతో పోరాడుతోంది.



బత్తుల అంజమ్మ



బత్తుల బ్రహ్మయ్య



బత్తుల నాగ మూర్తమ్మ



బత్తుల ముత్యాలమ్మ

మృతదేహాలకు పంచనామా

ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాత పడటంతో గ్రామంలో విషాదం నెలకొంది. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కుటుంబాలు పెద్దలను కోల్పోయి అనాథలుగా మారాయి. మంగళవారం నలుగురు మృతదేహాలను వినుకొండ ప్రభుత్వ వైద్యశాల్లో శవపంచనామా అనంతరం పోలీసులు బంధువులకు అప్పగించారు. మృతదేహాలను చూసిన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. చూపరులు సైతం కన్నీరు పెట్టుకున్నారు. వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకరరావు సారధ్యంలో ఎస్ఐ లేళ్ల లోకేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గురుకులం గోడు పట్టదా?

- మంచాలు లేక నేలపైనే నిద్ర
- బెంచీలు లేక కిందనే కూర్చుంటున్న విద్యార్థులు
- విద్యాలయానికి చేరుకునే మార్గం అధ్వానం
- పనిచేయని ఆర్వో ప్లాంట్‌లు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- అల్లాడుతున్న విద్యార్థులు



తరగతి గదిలో నేలపై కూర్చొని పాఠాలు వింటున్న విద్యార్థులు

యడ్లపాడు: మంచి క్రమశిక్షణకు..సమగ్ర విద్యకు మారుపేరైన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పలు సమస్యలు వెంటాడుతున్నాయి. యడ్లపాడు మండలం బోయపాలెంలోని ఏపీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలను విద్యార్థులు చదువు, క్రీడలు తదితర అంశాల్లో ప్రతిభ చాటుతున్నా వసతి కొరత తదితర వాటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ 5 నుంచి పదో తరగతి వరకు 450 మంది వరకు చదువుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రస్తుతం 316 మంది విద్యను అభ్యసిస్తున్నారు. గతంలో భోజనాలు బాగుండలేదంటూ ఇక్కడి విద్యార్థులు 35 మంది గోడదూకి రెండుసార్లు కొండవీడు కొండల్లోకి వెళ్లి నిరసన తెలపడంతో అప్పట్లో రాష్ట్రమంతటా కలకలం రేపిన విషయం తెలిసిందే. దీంతో ప్రిన్సిపాల్‌ను మార్చి దాసరి ప్రభాకరరావును నియమించారు. ఆ తర్వాత పారిశుద్ధ్యం, పరిశుభ్రత, ఆహారం విషయాలతోపాటు సరిపడా బోధకుల్ని సమకూర్చడంలో ప్రభాకరరావు కృతకృత్యులయ్యారు. మిగిలిన సమస్యలపై పలుమార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నేటికీ ఆయా సమస్యలు పరిష్కారం కాలేదు. సౌకర్యాలు కొరవడి విద్యార్థులు, వాటిని పరిష్కరించలేక ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. వీటిలో ప్రధానంగా తరగతి గదిలో బెంచీలు లేకపోవడం, లోయర్ క్లాస్ అయినా, హయ్యర్ క్లాస్ అయినా.. అందరూ నేలపైనే కూర్చుని చదువుకోవాలి ఒక్క బెంచీ కూడా లేకపోవడం విశేషం. మూడు ఆర్వో వాటర్ ప్లాంట్లు ఉన్నా ఒక్కటీ పనిచేయక మూలన పడి ఉన్నాయి. మరుగుదొడ్ల తలుపులు పలు ధ్వంసం కావడం, విద్యార్థులంతా వసతి గదుల్లోని నేలపైనే నిద్రించాల్సిన సమస్యలు నెలకొని ఉన్నాయి. ఇక పాఠశాలకు చేరుకునేందుకు ప్రధానమార్గం సమస్య ఉండనే ఉంది. బోయపాలెం-చెంఘీజ్‌ఖాన్‌పేట బీటీరోడ్డు నుంచి సుమారు 2 కిలోమీటర్ల దూరంలో ఉండే ఈ పాఠశాలకు ప్రధాన మార్గం లేకపోవడం, వర్షాలు కురిస్తే బైక్‌పై వెళ్లేందుకు ఫీట్స్ చేయాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. కోట్లాది రూపాయలు వెచ్చించి వందలాది మంది నిరుపేద గిరిజన కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉండే ఈ గురుకుల పాఠశాలలో అత్యంత మౌలిక సౌకర్యాలు కొరవడటం బాధాకరమని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





పగిలిపోయిన మరుగుదొడ్ల డోర్లు
పనిచేయని ఆర్వో వాటర్ ప్లాంట్స్

సాక్షి ఫోకస్

నాదెండ్ల: నాదెండ్ల మండలంలో రెండు వసతి గృహాలున్నాయి. గణపవరంలో ఎస్సీ బాలుర వసతిగృహం (ఇంటర్, డిగ్రీ కళాశాల) 24 మంది విద్యార్థులు వినియోగించుకుంటున్నారు. వీరికి ప్రతినెలా హెయిర్ కటింగ్, కాస్మోటిక్స్ కోసం రూ.250 నగదు అందిస్తారు. అయితే ఈ ఏడాది జనవరిలో ఇచ్చిన తర్వాత ఫిబ్రవరి నుంచి ఈ చార్జీలు నేటి వరకూ చెల్లించలేదు. విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయలేదు. నాదెండ్లలో ఎస్సీ బాలుర వసతిగృహంలో 90 మంది విద్యార్థులు ఉంటున్నారు. మూడు నుండి పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. జనవరిలో దుప్పట్లు, ట్రంకు పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు అందించారు. ఇటీవల పాఠశాలలు పునః ప్రారంభం నుంచి మరమ్మతులు నిర్వహించారు. విద్యార్థులకు సరిపడా బాత్రూంలు, మంచినీటి వసతి ఉన్నాయి.

పరదాలే ప్రహరీ..

అమరావతి: అమరావతి మండలంలోని బీసీ, ఎస్సీ హాస్టళ్లలో సమస్యలు తిష్ట వేశాయి. ధరణికోటలోని బీసీ, ఎస్సీ హాస్టళ్లలో 50 శాతం విద్యార్థులు కూడా లేరు. ఎస్సీ హాస్టల్‌లో 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మొత్తం 25మంది విద్యార్థులు ఉన్నారు. ఈ హాస్టల్ భవనం నూతనంగా నిర్మించింది కావటం, తక్కువ మంది విద్యార్థులు ఉండటంతో మరుగుదొడ్ల సమస్య లేదు. అలాగే బీసీ బాలుర హాస్టల్‌లో 23 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ హాస్టల్‌కు మరమ్మతులు జరగటం వల్ల పెద్దగా సమస్యలు లేవు. అయితే మరుగుదొడ్లలో ఐదు మాత్రమే పనిచేస్తున్నాయి. స్నానాల గదులకు తలుపులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్‌కు ఉత్తరాన క్రోసూరు రోడ్డు వైపు ప్రహరీ లేకపోవటంతో ఆకుపచ్చపట్ట కట్టారు. హాస్టల్‌లోకి జంతువులు, ఆకతాయిలు ప్రవేశిస్తున్నారు.



ధరణికోట బీసీ హాస్టల్‌లో ప్రహరీ లేక ఆకుపచ్చ పట్ట కట్టి ఉన్న దృశ్యం

పొంగుతున్న వాగులు

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చిలకలూరిపేట నియోజకవర్గంలోని పలు వాగులు పొంగిపొర్లుతున్నాయి. పంట పొలాలు నీట మునిగాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కుప్పగంజివాగు చప్టాకు అడ్డుగా ఉన్న కంపచెట్లు తొలగించారు. దీంతో నీటి ఉధృతి తగ్గింది.

–యడ్లపాడు/నాదెండ్ల



తిమ్మాపురం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఉప్పవాగు



యడ్లపాడు వద్ద నిండుగా ప్రవహిస్తున్న నక్కవాగు



గణపవరం వద్ద కుప్పగంజి వాగు చప్టాపై ప్రవహిస్తున్న నీరు

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నరసరావుపేట మున్సిపాలిటీకి 14వ ర్యాంకు

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్‌లో స్థానిక మున్సిపాలిటీకి 14వ ర్యాంకు లభించిందని కమిషనర్ ఎం.జస్వంతరావు మంగళవారం పేర్కొన్నారు. గతేడాది 18వ ర్యాంకు వచ్చిందన్నారు. ఈ ఏడాది పరిస్థితి మెరుగుపడిందన్నారు. దేశవ్యాప్తంగా 265వ ర్యాంకు సాధించటమే కాకుండా చరిత్రలో తొలిసారిగా ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ (ఓడీఎఫ్)లో 2ప్లస్ ర్యాంకు లభించిందన్నారు. బహిరంగ మలమూత్ర విసర్జన రహిత వాతావరణం కల్పించటంతోపాటు వ్యర్థాల నిర్వహణలో పనితీరుకు ప్రతిబింబంగా ర్యాంకులు లభించాయన్నారు.



క్లుప్తంగా

పేకాట స్థావరంపై పోలీసుల మెరుపుదాడి

చిలకలూరిపేటటౌన్: మండలంలోని కుక్కపల్లివారిపాలెం గ్రామ శివారులోని పొలాల్లో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ జి. అనిల్ కుమార్ నేతృత్వంలో పోలీసులు మంగళవారం దాడులు చేపట్టారు. అదుపులోకి తీసుకున్నవారి వద్ద నుంచి రూ.3,500 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రేవులో పడి వ్యక్తి మృతి



నిజాంపట్నం: వేటకు వెళ్తూ ప్రమాదవశాత్తు రేవులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇది. అడవులదీవి ఎస్ఐ బాబూరావు వివరాల మేరకు కొత్తపాలెం పంచాయతీ శారదానగర్‌కు చెందిన బాలకోటయ్య (23) సముద్రంలో వేటకు వెళ్ళేందుకు సోమవారం రేవులో పడవపై వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి రేవులో పడ్డాడన్నారు. గల్లంతైన బాలకోటయ్య మృతదేహాన్ని మంగళవారం రేవు ఒడ్డున గుర్తించామన్నారు. మృతుని సోదరుడు బాల శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

108 మీటర్ల జాతీయ జెండాతో తిరంగా యాత్ర



నందిగామలో 108 మీటర్ల జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సత్తెనపల్లి: త్రివర్ణ పతాకాన్ని జాతీయ జెండాగా భారత రాజ్యాంగ సభ 1947 జూలై 22న ఆమోదించిన సందర్భంగా హెల్ప్ ఫౌండేషన్ (సతెనపల్లి)ఆధ్వర్యంలో నందిగామలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో గ్రామంలోని ప్రధాన వీధుల్లో 108 మీటర్ల జాతీయ జెండాతో తిరంగా యాత్ర ర్యాలీ మంగళవారం నిర్వహించారు. సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడుతూ.. జాతీయ జెండా భారత దేశం యొక్క సార్వభౌమత్వం, ఐక్యతకు చిహ్నమన్నారు. సత్తెనపల్లి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఆళ్ల సాంబయ్య మాట్లాడుతూ త్రివర్ణ పతాకం భారతీయులకు అందించిన పింగళి వెంకయ్య తెలుగువారు కావడం మనందరికీ గర్వకారణమన్నారు. తొలుత పంచాయతీ కార్యాలయం దగ్గర ఉన్న మహనీయుల విగ్రహాలకు నివాళులర్పించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, పాఠశాల పీడీ సాంబశివరావు, చెంబేటి బోల్లయ్య, హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు అక్షయ్, నిర్మల్ కుమార్, జాతీయ జెండా వేషధారి శేఖర్, ఉపాధ్యాయ బృందం, అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, వాణి, జ్యోతి, అమల, గౌసియా, విద్యార్థులు పాల్గొన్నారు.

7, 8 తేదీలలో సీపీఐ మహాసభలు



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాంబాబు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా సీపీఐ మహాసభలను ఆగస్టు 7, 8 తేదీలలో వినుకొండలో నిర్వహిస్తున్నట్టు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు తెలిపారు. అరండల్‌పేటలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జిల్లా మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లా సమగ్రాభివృద్ధిలో భాగంగా నిర్వహిస్తున్న ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. 7వ తేదీన వినుకొండ ప్రధాన వీధుల్లో ర్యాలీ, సాయంత్రం 4 గంటలకు శివయ్య స్థూపం వద్ద బహిరంగ సభ, 8వ తేదీన ప్రతినిధుల సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మహాసభలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, జి.ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి ఏ.మారుతి వరప్రసాద్ తదితరులు హాజరవుతారని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, చక్రవరం సత్యనారాయణరాజు, షేక్.చినజాన్ సైదా, చిట్యాల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేయటమే టీడీపీ అజెండా

వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట: ఎన్నికల సందర్భంగా అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలచేత ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా సాకులు చెప్పే టీడీపీ నాయకుల లాంటి వారిని నియంత్రించేందుకు ఎన్నికల కమిషన్, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఏర్పాటు చేయాలని నరసరావుపేట వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆడబిడ్డ నిధి అమలు చేయాలంటే ఆంధ్రప్రదేశ్‌ను అమ్మాలంటూ మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలపై మంగళవారం డాక్టర్ గోపిరెడ్డి స్పందించి మీడియాతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, మధ్య తరగతి వర్గాలకోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తూ డీబీటీ ద్వారా ఐదేళ్లలో రూ.2.72లక్షల కోట్లు అందజేస్తే రాష్ట్రం శ్రీలంక అయిపోతుందంటూ టీడీపీ నాయకులు ప్రచారం చేశారన్నారు. తనకు 40ఏళ్ల ఇండస్ట్రీ అని, నాలుగోసారి సీఎం అంటూ చెప్పుకునే చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంచనా వేయకుండానే అంతకంటే ఎక్కువగా ఏ విధంగా గత ఎన్నికల సందర్భంగా ప్రతి మహిళకు నెలకు రూ.1500లు ఆడబిడ్డ నిధి ఇస్తానని హామీ ఇచ్చాడని ప్రశ్నించారు. ప్రజలకు హామీ ఇచ్చేసమయంలో అవగాహనతో ఇవ్వాలని అన్నారు. ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత కచ్చితంగా అమలు చేసేందుకు కఠినమైన నియంత్రణ ఉండాలన్నారు. టీడీపీ నాయకులకు ఏమాత్రం చిత్తశుద్ధిలేదని, ప్రజలను మోసం చేయటమే వారి అజెండానని స్పష్టం చేశారు.

హామీలు నెరవేర్చాలంటే రాష్ట్రాన్ని అమ్మాలంటున్నారు

- మోసపూరిత హామీలకు ప్రజలు బుద్ధి చెబుతారు
- గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



పిడుగురాళ్ల: మోసపూరిత హామీలను ఇంటింట ప్రచారం చేసి ఇప్పుడు హామీలు నెరవేర్చాలంటే రాష్ట్రాన్ని అమ్మాల్సిన పరిస్థితని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి నేతలు అనటం ప్రజలను మోసం చేయటమేనని గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం విడుదల చేసిన వీడియోలో కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు మహిళా శక్తి పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి మహిళకు నెలకు రూ.1500ల చొప్పున సంవత్సరానికి రూ. 18 వేలు ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారని, అయితే నేడు ఈ పథకం ద్వారా మహిళలకు నెలకు రూ. 1500 ఇస్తే రాష్ట్రాన్ని అమ్మాల్సిన పరిస్థితి ఉందని బహిరంగంగా తెలపటం, రాష్ట్రంలోని మహిళలను మోసం చేయడమేనన్నారు. ఈ పథకం అమలు చేస్తామని పవన్ కల్యాణ్ కూడా సంతకాలు పెట్టి హామీలకు ఊతమిచ్చారని, కానీ చివరకు హామీలు గాలికి వదిలేశారన్నారు.

కారు అద్దాలు పగలకొట్టి చోరీ

రెండు ల్యాప్‌టాప్‌లు, కొంత నగదు అపహరణ




కారు అద్దాలు పగలకొట్టి బ్యాగ్‌తో ఉడాయిస్తున్న వ్యక్తి

మంగళగిరి టౌన్ : రెండు వేర్వేరు కారుల అద్దాలు పగలకొట్టి ల్యాప్‌టాప్‌లు చోరీ చేసిన ఘటన మంగళగిరిలో మంగళవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు డీబీఎస్ బ్యాంక్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హెడ్ శ్రీనివాస్ సిల్వరాజ్ విధులు నిమిత్తం విజయవాడ బ్యాంకుకు వచ్చారు. అక్కడ పని ముగించుకుని విజయవాడ క్లస్టర్ హెడ్ సుధాకర్‌తో పాటు తన సిబ్బందితో గుంటూరు బ్యాంకుకు బయలుదేరారు. ఈ క్రమంలో మధ్యాహ్నం భోజనం చేసేందుకు చినకాకానిలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న భోజన హోటల్ వద్ద ఆగారు. అదే సమయంలో బద్వేల్‌కి చెందిన సాయిరాం అనే యువకుడు తన కుటుంబ సభ్యులతో ఎర్రబాలెంలో తాను కొనుగోలు చేసిన స్థలం చూడడానికి వచ్చి భోజనం చేసేందుకు వీరు కూడా వారి కారులో హోటల్‌కు చేరుకున్నారు. వీరిద్దరూ కార్లను పార్కింగ్ చేసి భోజనం చేయడానికి లోపలికి వెళ్లారు. భోజనం చేసి అనంతరం బయటకు వచ్చి చూడగా కారు అద్దాలు పగలకొట్టి ఉండడం గమనించారు. కారు లోపల పెట్టిన ల్యాప్‌టాప్, బ్యాగులు అపహరణకు గురి అయినట్లు గుర్తించారు. శ్రీనివాస్ సెల్వరాజ్ కారులో ల్యాప్‌టాప్‌తో పాటు క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులు ఉన్నాయని, సాయిరామ్ కారులో ల్యాప్‌టాప్‌తో పాటు సుమారు 5 వేల రూపాయలు నగదు, ఇంటి తాళాలు, బీరువా తాళాలు ఉన్నట్లు చెప్పారు. ఈ ఘటనపై మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. రూరల్ పోలీసులు సీసీ కెమెరా పుటేజ్ ఆధారంగా కేసును దర్యాప్తు చేస్తున్నారు.

10 మంది వైఎస్సార్ సీపీ నేతల విచారణ

సత్తెనపల్లి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత నెల 18న పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల పర్యటన సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించారంటూ నమోదైన అక్రమ కేసులో 10 మంది వైఎస్సార్ సీపీ నేతలను మంగళవారం సత్తెనపల్లిటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ నాగమల్లేశ్వరరావు విచారించారు. సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, సీనియర్ న్యాయవాది పెండెం బాబురావుతో పాటు నాయకులు జూపల్లి పాల్, జడా ప్రసాద్, కూకుట్ల శ్రీనివాసరావు, అజయ్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, పవన్‌కుమార్, ప్రమోద్,వినోద్, ఉల్లం.శ్రీనులను విచారించారు.

ఆర్టీఐ అర్జీలకు సకాలంలో సమాచారం అందించాలి



మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి వెంకట్రావు

నరసరావుపేట రూరల్: ఆర్‌టీఐ అర్జీలకు సకాలంలో సమాచారం అందించే బాధ్యత అధికారులతో పాటు సిబ్బందిపై ఉందని జిల్లా ఉద్యాన అధికారి ఎ.వెంకట్రావు తెలిపారు. జిల్లా ఉద్యాన కార్యాలయంలో మంగళవారం సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ఆర్‌టీఐ ద్వారా ప్రభుత్వ వ్యవస్థ, ప్రజల పట్ల బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో జరుగుతున్న కార్యక్రమాలను ఈ చట్టం ద్వారా ప్రజలు తెలుసుకునే అవకాశం ఉందన్నారు. దీని ద్వారా పాలనలో పారదర్శకతకు అవకాశం ఉంటుందని వివరించారు. సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట బి.వెంకటేశ్వరరావు, ఉద్యాన అధికారులు, కార్యాలయ సిబ్బంది, గ్రామ ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ పథకంపై గ్రీవెన్స్‌కు అవకాశం



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు

నరసరావుపేట రూరల్: అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఈనెల 23వ తేదీ బుధవారం లోపు రైతుసేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకుని వద్ద గ్రీవెన్స్ పెట్టవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు తెలిపారు. మండలంలోని లింగంగుంట్ల, అల్లూరివారిపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారావు మాట్లాడుతూ పంట సాగు చేసే కౌలు రైతులు కౌలు కార్డులు పొందాలని తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో వరి పంటకు ఎకరానికి రూ.80లు ప్రీమియం చెల్లించి ఆగస్టు 15వ తేదీ కల్లా ఇన్స్యూరెన్స్ చేసుకోవాలని సూచించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు, సహాయ వ్యవసాయ సంచాలకులు వి.హనుమంతురావు, ఏట ఐ.శాంతి, ఏఈవో బ్రహ్మయ్య, వీఏఏ సామంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాసుపై తప్పుడు ప్రచారం మానుకోవాలి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి యెనుముల



గురజాల : వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు, నాయకులకు మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఎల్లప్పుడు అందుబాటులో ఉంటున్నారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి అన్నారు. ఆయన తన కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నియోజకవర్గంలోని కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటూ వారికి భరోసా కల్పించడం జరుగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో ప్రారంభించిన పిడుగురాళ్ల– జానపాడు ఓవర్ బ్రిడ్జి పనులు, మెడికల్ కళాశాల పనులు నిలిచిపోతే పోరాటం చేసి వాటి పనులు ప్రారంభించేలా చేసిన ఘనత కాసు మహేష్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దీంతో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు వెంటనే స్పందించి సంవత్సర కాలంలో మెడికల్ కళాశాల పూర్తి చేస్తామని హామీ కూడా ఇచ్చారని గుర్తు చేశారు. నిత్యావసర వస్తువులు ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడడం, పంటలకు గిట్టుబాటు ధరల లేక రైతులు విలవిల్లాడి పోతున్న సంఘటనలు కూటమి ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కాసు మహేష్‌రెడ్డిపై ఆరోపణలు మానుకోవాలన్నారు.

కార్యకర్తలకు వెన్నుదన్నుగా...

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రేపాల శ్రీనివాసరావు



మాట్లాడుతున్న రేపాల శ్రీనివాసరావు

పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు వెన్నుదన్నుగా ఉండేది మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అని ఆ పార్టీ సెక్రటరీ, రాష్ట్ర మున్సిపల్ విభాగం అధ్యక్షులు రేపాల శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారం విడుదల చేసిన వీడియోలో ఆయన మాట్లాడుతూ... ఆయన కార్యకర్తలను పట్టించుకోవటం లేదని చెప్పటం సరికాదన్నారు. నియోజకవర్గంలో ఏ కార్యకర్తకు, ఏ నాయకుడికి సమస్య వచ్చినా కాసు మహేష్‌రెడ్డి నిలబడి సమస్యలను పరిష్కరించేందుకు ముందు ఉన్నారన్నారు. నియోజకవర్గంలో కార్యకర్తలను అధికార పార్టీ నేతలు ఇబ్బందికి గురి చేసినప్పుడు, పోలీసులు తప్పుడు కేసులు పెట్టినప్పుడు కాసు మహేష్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించి అండగా నిలిచారన్నారు.

దమ్మనవారిపాలెంలో భారీ చోరీ

కర్లపాలెం: దమ్మనవారిపాలెంలో భారీ చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కర్లపాలెం ఎస్ఐ జి.రవీంద్ర తెలిపిన వివరాల మేరకు కర్లపాలెం మండలంలోని దమ్మనవారిపాలెం గ్రామానికి చెందిన పిట్ల పెద వెంకటరెడ్డి కుటుంబంతో ఈనెల 17వ తేదీన పాండిచ్చేరిలో ఉన్న కుమార్తె వద్దకు వెళ్ళాడు. ఈనెల 20వ తేదీన పెద వెంకటరెడ్డి ఇంటి వెనుక తలుపులు తెరిచి ఉండటంతో గమనించిన స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఈనెల 21వ తేదీన వెంకటరెడ్డి స్వగ్రామానికి వచ్చి ఇంటిని పరిశీలించగా చోరీ జరిగినట్లు గుర్తించాడు. బీరువా లాకరులో ఉన్న 141 గ్రాముల బంగారం, అరకిలో వెండి, రూ.5వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి ఫిర్యాదు ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. బాపట్ల రూరల్ సీఐ హరిబాబు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నామని క్లూస్ టీమ్స్ పిలిపించి వేలిముద్రలు సేకరిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రైలు ఢీకొని ఉద్యోగి మృతి



ఘటనా స్థలంలో జాన్‌బాబు మృతదేహం

తెనాలి రూరల్: రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. గుంటూరు ఆర్ అండ్ బీ శాఖలో ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్న జాన్‌బాబు(50) మంగళవారం ఉదయం స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనాస్థలికి చేరుకొని కన్నీరుమున్నీరయ్యారు. జాన్‌బాబు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఘటనాస్థలిని రైల్వే పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జీఆర్పీ ఎస్ఐ జి. వెంకటాద్రిబాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి



దినేష్ మృతదేహం

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందిన సంఘటన మంగళవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రత్తిపాడుకు చెందిన దినేష్ (20) మిట్టపల్లి ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం కళాశాల నుంచి తన స్నేహితుడు గణేష్‌తో కలిసి ద్విచక్రవాహనంపై గుంటూరుకు బయలుదేరాడు. చౌడవరం వద్ద హైవేపై డివైడర్ రైలింగ్‌కు ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం ఢీకొంది. దినేష్ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. గణేష్‌కు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు వచ్చి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. మృతుని తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

జిల్లాలో 1325.2 మిల్లీమీటర్ల వర్షం

నరసరావుపేట: గడిచిన 24 గంటల వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా 1325.2 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు మంగళవారం వెల్లడించారు. అత్యధికంగా దాచేపల్లిలో 88.2 మి.మీ వర్షం పడగా అత్యల్పంగా వినుకొండలో 14.0 కురిసిందన్నారు. మొత్తం 28 మండలాల్లో వర్షం నమోదైందన్నారు.

శాస్త్రవేత్తలుగా జెడ్పీ పాఠశాల విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం లింగిసెట్టి సాంబయ్య

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8, 9వ తరగతుల విద్యార్థులు ఐదుగురు జాతీయ స్థాయి వన్డే యాజ్ ఏ సైంటిస్ట్ ప్రోగ్రామ్‌కు ఎంపిక అయినట్లు పాఠశాల హెచ్‌ఎం లింగిసెట్టి సాంబయ్య మంగళవారం తెలిపారు. పాఠశాలకు చెందిన బి.అనుశ్రీ,, షేక్ ఖాసీం, షేక్ మస్తాన్‌వలి, కె.ప్రశాంత్, షేక్ అన్వర్‌లను ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షల్లో ఎంపిక చేశారని చెప్పారు. జిగ్యాసా ప్రోగ్రామ్‌లో భాగంగా దేశంలో కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్), అంతర్జాతీయ స్థాయి పరిశోధన సంస్థ (భువనేశ్వర్)లో ఈ నెల 24న విద్యార్థులు అక్కడున్న శాస్త్రవేత్తలతో కలిసి పనిచేస్తారని తెలిపారు. విద్యార్థులను పలువురు ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బి.నాగరాజులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.రామాంజనేయులు, రాజులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో టైలర్ షాపు దగ్ధం

మేదరమెట్ల: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కొరిశపాడు మండలం తిమ్మనపాలెం గ్రోత్ సెంటర్ సమీపంలోగల టైలర్ దుకాణం సోమవారం అర్ధరాత్రి మంటల్లో కాలిపోయింది. బాధితులు తెలిపిన సమాచారం మేరకు.. సోమవారం రాత్రి దుకాణం తలుపులు వేసి ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో స్థానికులు ఫోన్ చేసి షాపులో మంటలు వస్తున్నాయని చెప్పటంతో అక్కడకు వచ్చే సరికి దుకాణం పూర్తిగా కాలిపోయింది. దుకాణంలో ఉన్న బట్టలు, సామాగ్రి దగ్ధమయ్యాయని.. వాటి విలువ రూ.2లక్షల వరకు ఉంటుందని వాపోయాడు.

లారీని ఢీ కొన్న ఆటో.. ఇద్దరికి గాయాలు

మేదరమెట్ల: ఆగిఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన టాటాఏస్ ఆటో ఢీ కొన్న సంఘటన జాతీయ రహదారిలోని పి.గుడిపాడు గాజు ఫ్యాక్టరీ వద్ద మంగళవారం జరిగింది. బెంగళూరు నుంచి విజయవాడకు వెళుతున్న కొరియర్ లారీ పి.గుడిపాడు జాతీయరహదారి గాజు ఫ్యాక్టరీ సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉంది. ఒంగోలు వైపు నుంచి వస్తున్న టాటాఏస్ ఆటో డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపు తప్పిన ఆటో ఆగిఉన్న లారీని ఢీ కొంది. దీంతో లారీలోని డ్రైవర్‌కు.. ఆటో డ్రైవర్‌కు గాయాలు కాగా 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.